# కొరియా ద్వీప కల్పంలో శాంతిసాధన మార్గంలో అవరోధాలు




**ఉత్తరకొరియా** అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్ 'ఒలింపిక్ దౌత్యం'గా పేరుగాంచిన దానిద్వారా చేసిన చొరవ గొప్ప విజయాన్ని సాధించింది. అది కొరియా ద్వీపకల్పంలో ఉద్రిక్త వాతావరణంలో మార్పుకు కారణమైంది. అలాగే చర్చలు జరగడానికి వీలుగా అనేక చర్యలు తీసుకోవడానికి తాత్కాలికంగానైనా దోహదపడింది. కొరియాలోని ఇరుదేశాల ప్రజల మధ్య ఐక్యత, శాంతి ఆకాంక్షలను, భావనలను ఈ చర్యలు రేకెత్తించాయి. ఇవి అమెరికాను స్వీయరక్షణలో పడవేయడమేగాక ఉత్తరకొరియాతో చర్చలు జరపడానికి అంగీకరించే విధంగా ఒత్తిడి తెచ్చాయి.

ఉత్తరకొరియా అధ్యక్షులు కిమ్ జాంగ్ ఉన్, దక్షిణకొరియా అధ్యక్షులు మూన్ జాయ్ సుహృద్భావ వాతావరణంలో జరిగిన అంతర్ కొరియన్ల శిఖరాగ్ర సమావేశంలో కలుసుకున్నారు. అతిథిగృహ పుస్తకంలో కిమ్ "ఒక కొత్త చరిత్ర ఇప్పుడు ప్రారంభమవుతుంది. ఒక కొత్త శాంతి శకం చరిత్రకు నాంది పడుతుంది." అని వ్రాశారు. చేయి చేయి పట్టుకొని దక్షిణ కొరియాలో నడిచారు. ఏకాంత సంభాషణల్లో ఘర్షణల చరిత్రకు చరమాంకం పలకడానికి తాను ఈ శిఖరాగ్ర సమావేశానికి వచ్చినట్లు కిమ్ మూన్‌తో చెప్పాడు. వారిరువురూ కలిసి సంగీత ప్రదర్శనను చూశారు. ఈ సమావేశపు ఫోటోల ప్రదర్శనను తిలకించిన సందర్భంలో చేతులు జోడించి పైకెత్తి తమ ఐక్యతను చాటారు. ఈ ఫోటోల ఆధారంగా "తిరిగి ఒకే కుటుంబంగా ఐక్యమవుదాం" అనే చరణంతో కూడిన పాప్ పాట కూడా రూపుదిద్దుకుంది.

ఇరువురు నాయకుల సంయుక్త ప్రకటన– ఇప్పటికే వున్న అన్ని ఒప్పందాలు, ప్రకటనలు పూర్తి స్థాయిలో అమలుచేస్తామని వాగ్దానం చేసింది.

- సంయుక్త సమన్వయ కార్యాలయాన్ని ఏర్పాటుచేయడం
- మరింత సక్రియాత్మక సహకారాన్ని ప్రోత్సహించడం
- ఇరువైపుల నుండి సందర్శనలు, మార్పిడులు, ఒప్పందాలు చేసుకోవడం
- అంతర్జాతీయ క్రీడా పోటీల్లో సంయుక్తంగా పాల్గొనడం
- మానవీయ అంశాలను నిరాటంకంగా పరిష్కరించుకొనుటకు ప్రయత్నించడం
- భూమి, సముద్రం, ఆకాశానికి సంబంధించిన వాటితోసహా అన్ని రంగాలలోని స్పర్ధలను పూర్తిగా తొలగించుకోవడం
- నిస్సైనిక ప్రాంతాలను శాంతి మండలాలుగా మార్చుకోవడం
- పశ్చిమ సముద్రంలోని ప్రస్తుత ఉత్తర హద్దురేఖను సముద్రయాన మండలంగా మార్చేందుకు వీలుగా ఆచరణాత్మక ప్రణాళిక ఏర్పరచటం
- రక్షణ మంత్రిత్వస్థాయిల్లో, క్షేత్రస్థాయిల్లో క్రమంగా సమావేశాలు నిర్వహించుకొని తక్షణం సైనిక సమస్యలను పరిష్కరించుకోవడం
- ఒకరిపై ఒకరు సైనిక చర్యలకు తావులేని, దురాక్రమణ రహిత ఒప్పందాలకు కట్టుబడి వుండడం
- దశలవారీగా నిరాయుధీకరణ చర్యలు చేపట్టడం
- అమెరికాను కలుపుకొని త్రైపాక్షిక సమావేశాలకు, అమెరికా, చైనాలను కలుపుకొని చతుర్ముఖ సమావేశాల నిర్వహణకు కృషిచేయడం ద్వారా కొరియా ద్వీపకల్పంలో యుద్ధానికి చరమగీతం పాడడం, పూర్తి అణ్వస్త్ర నిరాయుధీకరణ ద్వారా ద్వీపకల్పాన్ని అణ్వస్త్రరహిత ప్రదేశంగా మార్చివేయడం ద్వారా ఇరుదేశాలు ఐక్యంగా వుండాలనే లక్ష్యసాధన దిశగా కృషిచేస్తామని సంయుక్త ప్రకటన పేర్కొంది.

ఆవిధంగా ఆ సంయుక్త ప్రకటన శాశ్వితంగా తమ మధ్య విబేధాలకు స్వస్తిచెప్పి, శాంతి, ఐక్యత, సమగ్రాభివృద్ధిల దిశగా పయనించాలనే ఉభయ దేశాల ప్రజల ఆకాంక్షలను, న్యాయమైన కోర్కెలను ప్రతిబింబించింది.

ఉభయదేశాల నాయకులు తమ మధ్య చర్చలను అర్ధవంతంగా పూర్తిచేసుకోగల సమర్థులుగా మిగిలారు. తమ మధ్య విబేధాలను శాశ్వతంగా పరిష్కరించుకునే విధంగా చర్చలు చేయగలిగితే వారివారి ప్రజల నుండి తమకు అత్యధిక మద్దతు లభిస్తుందని ఆశించగలరు. కాని దక్షిణ కొరియా పాలకవర్గాలకు అమెరికాతో ఉన్న దాస్య సంబంధాలు – 28,500 మంది సైనిక బలగంతో కూడిన దక్షిణ కొరియాలోని అమెరికా సైనిక స్థావరాలు, కొరియా లోపల, చుట్టుప్రక్కల మోహరింపబడిన అత్యంత భారీ మరియు అధునాతన ఆయుధాలు – దక్షిణ కొరియాకు స్వతంత్రంగా, చొరవగా వ్యవహరించడానికి వీలులేని విధంగా అనిశ్చిత

పరిస్థితిలోకి, అత్యంత బలహీన స్థితిలోకి నెడ్తున్నాయి. ఉత్తరకొరియా నాయకులకు కూడా ఈ పరిస్థితి తెలుసు. కొరియా ద్వీపకల్పంలో శాంతి, భద్రతలు సాకారంకావాలన్నా, కలకాలం నిలవాలన్నా అమెరికా జోక్యం నుండి, ఆధిపత్యం నుండి దక్షిణకొరియా బయటపడినప్పుడు మాత్రమే అది సాధ్యమని వారికి అవగాహన వుంది. అందువల్లనే వారు అమెరికాతో చర్చలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చారు.

శాంతికొరకు ఉత్తరకొరియా వేసిన ముందడుగు, కొరియా ద్వీపకల్పంలోనూ, ప్రపంచ వ్యాప్తంగానూ దానికొచ్చిన అనుకూల స్పందన ఉత్తరకొరియాతో చర్చల ప్రక్రియకు అంగీకరించడం మినహా అమెరికాకు ప్రత్యామ్నాయం లేకుండా చేశాయి. చర్చలకు జూన్ 12వ తేదీ ఖరారు చేయబడింది.

అయితే అమెరికా - ఉత్తరకొరియా చర్చల ప్రారంభానికి ముందే, అమెరికా తన దుష్ట తలంపులను బయటపెట్టడం ప్రారంభించింది. ఉత్తరకొరియా పట్ల అమెరికా తీసుకున్న కఠిన విధానాలు, చైనాపై అమెరికా పెంచిన ఒత్తిడి ఫలితంగానే ఉత్తరకొరియా చర్చలకు సిద్ధపడినట్లు ట్రంప్ అతని అధికారులు ప్రచారం సాగించారు. ఉత్తరకొరియా ఈ ప్రచారాన్ని సరిగ్గానే అంచనా వేసింది. "ఉత్తర, దక్షిణ కొరియాల నాయకుల మధ్య జరిగిన శిఖరాగ్ర చర్చల ఫలితంగా మొగ్గతొడిగిన అంతర్జాతీయ సామరస్యాన్ని నాశనం చేయడానికి అమెరికా చేస్తున్న ప్రమాదకరమైన ప్రయత్నం ఇది. అలాగే శాంతి, సామరస్యాలవైపు పరిస్థితులు పయనిస్తున్న ఈ సమయంలో ఉత్తర కొరియాను రెచ్చగొట్టడానికి అమెరికా కావాలని చేస్తున్న ప్రయత్నంగా" ఉత్తర కొరియా అభివర్ణించింది.

"పూర్తి అణ్వస్త్ర నిరోధానికి, అణ్వస్త్ర రహిత కొరియా ద్వీపకల్పం కొరకు" తాను కట్టుబడి వున్నట్లు ఉత్తర కొరియా ప్రకటించింది. కొరియా ద్వీపకల్పంలో అణ్వస్త్ర నిరోధం, శాంతి స్థాపన సాకారమయ్యేందుకు దీనితో సంబంధమున్న అన్ని వర్గాలు కలిసికట్టుగా, దశలవారీగా ఏక కాలంలో తప్పనిసరిగా తగిన చర్యలు తీసుకోవాలన్న తన కోర్కెను వ్యక్తపరిచింది.

కాని అమెరికా నాయకులు మౌలికంగా భిన్నమైన విధానాన్ని పాటిస్తున్నారు. అమెరికా విదేశాంగశాఖామంత్రి మైక్ పాంపియో "అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్‌తో చేసుకునే ఒప్పందంలోనైనా సరే ఉత్తరకొరియా తన అణ్వస్త్రాల కార్యక్రమాలను నిలిపివేయడంలో ఎలాంటి వెనుకడుగు వేయరాదు" అని అన్నాడు. అలాగే అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జాన్ బోల్టన్ "మా దృష్టిలో 2003, 2004కు చెందిన లిబియా నమూనా వుంది" అని వెల్లడించాడు. ఈ ప్రకటనలు ఉత్తర కొరియాను రెచ్చగొట్టాయి. 2018 మే 16న ఉత్తర కొరియా "ఒకవేళ అమెరికా మమ్మలను ఏకపక్షంగా ఒప్పందానికి కట్టుబడి వుండాల్సిన పరిస్థితులకు నెట్టివేసే ప్రయత్నం చేస్తే అలాంటి చర్యలకు మేమెంతమాత్రం సిద్ధంగా లేము. అలాగే పునరాలోచించుకోవడం తప్ప అలాంటి పరిస్థితికి అంగీకరించలేము" అని స్పష్టపరిచింది. లిబియా నమూనాగురించి బోల్టన్ వ్యాఖ్యలు "అర్ధరహితమనీ, మా దేశం, విషాదకరమైన పరిస్థితులను కొని తెచ్చుకున్న లిబియా, ఇరాక్‌ల లాంటిది కాదని" తేల్చి చెప్పింది.

ఈ మధ్య కాలంలో అమెరికా, దక్షిణ కొరియాలు కలిసి 'మాక్స్ థండర్' అనే యుద్ధ విన్యాసాలను ప్రదర్శించాయి. ఈ చర్య చర్చల వాతావరణాన్ని దెబ్బతీసింది. ఉత్తర కొరియా దక్షిణ కొరియాతో చర్చలను విరమించుకునేందుకు పురిగొల్పింది.

ఆవిధంగా అమెరికా 'చెడగొట్టే' పాత్రను పోషిస్తోంది. అమెరికా ఉద్దేశ్యంలో కొరియా ద్వీపకల్పంలో అణ్వస్త్ర నిర్మూలన, అణ్వస్త్రరహితం అంటే ఉత్తర కొరియా తన అణ్వాయుధాలను నాశనం చేయాలి. ఉత్తర కొరియా తన మాటమీద నిలబడిందో లేదో తెలుసుకోవడానికి అమెరికా విచారణకు ఉత్తర కొరియా తలొగ్గి వుండాలి. 'అమెరికా ఏకకాలంలో కొరియా ద్వీపకల్పం నుండి తన అన్ని అణ్వస్త్ర ఆయుధాలను, ఇతర ఆయుధ వ్యవస్థలను తొలగించాలని' ఉత్తర కొరియా సహేతుకంగా డిమాండ్ చేస్తున్నది. అయితే ఈ డిమాండ్ అమెరికాకు ఆమోదయోగ్యంగా లేదు. తన ఆయుధాలను వుంచాలా, తీసివేయాలా అనేది తన స్వంత విషయంగా అమెరికా భావిస్తోంది. ఒక అగ్రశక్తిగా ప్రపంచంపై తన ఆధిపత్యాన్ని ఏర్పాటు చేసుకోవాలనుకుంటోంది. 'ప్రపంచంలోని ఆయుధా లపై గుత్తాధిపత్యం వుండడం తన హక్కు, తన అవసరం. తాను ప్రపంచశాంతి భద్రతలకు కాపలాదారు. కొరియా లాంటి చిన్న దేశాలు ఎలాంటి ఆయుధాలు కలిగి వుండాలి; ఎలాంటి ఆయుధాలు కలిగి వుండరాదని తను నిర్ణయిస్తుంది. చిన్నదేశాల ప్రవర్తనను తాను పర్యవేక్షిస్తుంది'. ఒక్కమాటలో చెప్పాలంటే ఈ వైఖరి సామ్రాజ్యవాద ఆధిపత్య రాజకీయం తప్పితే వేరుగాదు. ఆసియాపై, ఆసియా పసిఫిక్ ప్రాంతంపై ఆధిపత్యం కొరకు అమెరికా పెద్ద ఆటనే ఆడుతుంది. కొరియా ద్వీపకల్పంలో తన సైనిక స్థావరాలు, సైనిక జోక్యం, కార్యకలాపాలన్నీ ఆ ఆటలో భాగమే. అందువల్ల అణ్వస్త్రరహిత కొరియా ద్వీపకల్పం కొరకు సాగుతున్న పోరాటం అదొక రాజకీయ ప్రాముఖ్యత గల అంశంగా, ఆ ప్రాంత ప్రజానీకం యొక్క ఆందోళనగా ముందుకొచ్చింది.

కొరియా ద్వీపకల్పంలో శాంతికి పెనుముప్పు, ప్రజల మధ్య చీలికలకు, ఘర్షణలకు, ఉద్రిక్తతలకు కారణం అమెరికా ఆధిపత్య, జోక్యందారీ రాజకీయాలు మాత్రమే. అందుకే మనం కొరియా ద్వీపకల్పంలో మరియు ఆసియా పసిఫిక్ ప్రాంతంలో అమెరికా మిలటరీ స్థావరాలను ఉపసంహరించు కోవాలనీ, దాని యుద్ధ వ్యవస్థలను నిర్మూలించాలనీ డిమాండ్ చేయాలి. ఉత్తర, దక్షిణ కొరియాలు తమ సమస్యలను పరిష్కరించుకొనుటకు, ఐక్యతను, సుస్థిర శాంతిని సాధించుకోవడానికి అనుసరిస్తున్న చర్చల ప్రక్రియను నిర్వీర్యం చేయడానికి అమెరికా చేస్తున్న అన్ని ప్రయత్నాలను మనం తప్పక ఖండించాలి. అణ్వాయుధాలు మరియు ఇతర అన్నిరకాల ఆయుధాల ఉత్పత్తిని, నిల్వచేసుకోవడాన్ని, ఉపయోగించడాన్ని సమగ్రంగా నిషేధించాలనీ, ఈ చర్యలన్నీ అగ్రరాజ్యాల నుండే ప్రారంభం అయ్యే విధంగా, ప్రపంచశాంతికి, అణ్వస్త్రరహిత ప్రపంచం కొరకు మన పోరాటాలను ఉధృతం చెయ్యాలి.

oooo